

యాచారం ఠాణా ముట్టడి

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను శిక్షించాలంటూ మొండిగౌరెల్లి గ్రామస్తులు యాచారం ఠాణాను ముట్టడించారు. 8లో▸



గోవుల తరలింపు

కలెక్టర్ ఆదేశాలతో దొంతాన్‌పల్లి గోశాలలో ఉన్న గోవులను గురువారం వివిధ గోశా లలకు తరలించారు. 8లో▸



ఇదేం నాణ్యత..!

నాణ్యత లేకుండా రోడ్డు వేయడం ఏమిటని క్వాలిటీ కంట్రోల్ అధికారులు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

సాయిచంద్ కుటుంబ సభ్యులకు పరామర్శ



సాయిచంద్ సతీమణిని ఓదారుస్తున్న ఎమ్మెల్సీ కవిత

బడంగ్‌పేట్: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, గాయకుడు, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ సతీమణి రజిని, కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కవిత గురువారం పరామర్శించారు. గుర్రంగూడలోని సాయిచంద్ నివాసానికి చేరుకున్న కవిత సాయిచంద్‌కు నివాళి అర్పించి రజిని, కుమారుడు, కుమార్తెను పరామర్శించి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. అంతకు ముందు విద్యాశాఖమంత్రి సబితారెడ్డి సాయిచంద్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో టీఎస్‌జీవోస్ నాయకుడు విఠల్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల నిర్వహణ కోసం ఉపయోగించే ఈవీఎం, వీవీ ప్యాట్ల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ హరీశ్ తెలిపారు. వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గురువారం రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్స్‌లో ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ ను తనిఖీ చేసి భద్రపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈవీఎంలను జూన్ 12 నుంచి జూలై 6వ తేదీ వరకు 25 రోజులు తనిఖీ చేసినట్టు చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఈవీఎంలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

ఆమనగల్లుకు పాలిటెక్నిక్ కళాశాల

ఆమనగల్లు: పట్టణానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరైంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. 2023–24 విద్యాసంవత్సరం నుంచి కళాశాలను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలని సాంకేతిక విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా ఈ ప్రాంత విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ఏర్పాటు చేసిన ప్రచార సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమనగల్లులో డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. కళాశాలలు ఏర్పాటు కాకపోవడంతో ఇటీవల వివిధ విద్యార్థి సంఘాలు ప్రభుత్వం, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో ఆమనగల్లులో డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఇటీవల అభ్యర్థించారు. ఈ క్రమంలో పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

10 నుంచి రేషన్ పంపిణీ



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా ఈ నెల 10 నుంచి రేషన్ పంపిణీ ప్రారంభం కానుంది. సాంకేతిక కారణాలతో ఆలస్యంగా పంపిణీ ప్రారంభిస్తున్నట్లు పౌరసరఫరా శాఖ అధికారులు తెలిపారు. ఇంకా నెలవారీ ఉచిత బియ్యం కోటాపై స్పష్టత రాలేదు. గత కొన్ని నెలలుగా యూనిట్ కు కేవలం ఆరు కిలోలు మాత్రం అందిస్తున్నారు. జులై నుంచి పెరిగే అవకాశం ఉందని ప్రచారం సాగుతున్నా.. ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారులు పేర్కొంటున్నారు.

చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీబీఏ కోర్సు

చేవెళ్ల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీబీఏ (బ్యాచలర్స్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) కోర్సుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనురాధ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కళాశాలలో ప్రస్తుతం ఉన్న బీఎస్సీ, బీఏ, బీకాం, కోర్సులతోపాటు బీబీఏ కోర్సులో కూడా విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 60 మందికి అవకాశం ఉందని చెప్పారు. ఈ కోర్సు ద్వారా విదేశాల్లో ఎంబీఏ విద్యాభ్యాసం చేసేందుకు, కార్పొరేట్, బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందటానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా అడ్మిషన్ పొందాలని సూచించారు.

మె'నో'



'మధ్యాహ్న భోజనానికి' ధరల సెగ

- హాస్టల్ మెనూ నుంచి టమోటా, ఆకుకూరలు ఔట్
- తగ్గిన మిగతా కూరగాయల సరఫరా
- తినలేక పస్తులుంటున్న విద్యార్థులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పెరిగిన కూరగాయలు, కోడి గుడ్డు, చికెన్ ధరలు సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల భోజనంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గున మండుతుండడంతో సరఫరాదారులు చేతులెత్తేశారు. టమోటాను పూర్తిగా నిలిపివేశారు. గోరు చిక్కుడు, దొండ, బెండ, దోస, కాకర, బీర, సొర, వంకాయలను మాత్రమే సరఫరా చేస్తున్నారు. పది కిలోలు సరఫరా చేయాల్సిన చోట రెండు మూడు కేజీలతో సరిపెడుతున్నారు. పుంటికూర (గోంగూర) మినహా పాలకూర, ఇతర ఆకు కూరలు అసలే కనిపించడం లేదు. విద్యార్థుల నిష్పత్తి మేరకు కాయగూరలు సరఫరా చేయకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో వంట సిబ్బంది కూరలో ఉప్పు, కారం ఎక్కువ వేసి అందరికీ వడ్డిస్తున్నారు. పాలు, పెరుగు మాత్రమే కాదు వారంలో మూడు సార్లు ఇవ్వాల్సిన కోడిగుడ్డు, వీకెండ్‌లో వడ్డించాల్సిన చికెన్ సైతం మెనూలో నుంచి మాయమైంది. ఒకటి రెండు హాస్టళ్లలో వడ్డించినా చికెన్ ముక్కలు మచ్చుకు ఉండడం లేదు. ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కడుపునిండా పౌష్టికాహారం మాటేమోగానీ.. కారం మెతుకులతో కడుపు నింపుకోవాల్సి వస్తోంది.

నాసిరకం బియ్యం..

జిల్లాలో 1,309 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో 1,276 స్కూళ్లలో మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నారు. 1,53,957 మంది విద్యార్థులు భోజనం చేస్తున్నారు. 20 కేజీబీవీ పాఠశాలలు ఉండగా, వీటిలో ఆరు వేల మంది, 9 మోడల్ స్కూళ్లు ఉండగా, వీటిలో ఆరు వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో మరో 20 వేల మంది వరకు ఉన్నారు. వీరికి ఉచిత విద్యతో పాటు కడుపు నిండా భోజనం పెట్టేందుకు ప్రభుత్వం బియ్యం సరఫరా చేస్తోంది. గోదాముల్లో రోజుల తరబడి నిల్వ ఉండి ముక్కిపోయి, తోకపురుగులు, లక్క పురుగులు, రాళ్లతో కూడిన నాసిరకం బియ్యాన్ని పంపుతుండటంతో విద్యార్థులు వాటిని తినలేకపోతున్నారు. గిట్టుబాటు కాకపోవడంతో మెజార్టీ కాంట్రాక్టర్లు ఆయా కాయగూరలను సరఫరా చేసేందుకు నిరాకరిస్తున్నారు. ఇప్పటికే కోడిగుడ్లు, చికెన్ సరఫరాను నిలిపివేసిన కాంట్రాక్టర్లు తాజా గా టమోటాను తగ్గించారు.

వంటకు తప్పని తంటా

మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా ప్రభుత్వం ఒకటి నుంచి 5వ తరగతి చదువుతున్న ఒక్కో విద్యార్థికి రోజుకు వంద గ్రాముల బియ్యం, 6 నుంచి 10వ తరగతి చదువుతున్న ఒక్కో విద్యార్థికి 150 గ్రాములు సరఫరా చేస్తోంది. ఉప్పు, పప్పు, ఆయిల్, కాయగూరలు, మసాలాలు, కోడి గుడ్డు, ఇతర పోపు దినుసులకు అదనంగా చెల్లిస్తోంది. వీటిని సీసీహెచ్‌లే సమకూర్చుకోవాల్సి వస్తోంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.4.97 చొప్పున, ఆరు నుంచి 8వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.7.45, చొప్పున, 9, 10 తరగతి చదువుతున్న ఒక్కో విద్యార్థికి రూ.9.45 చొప్పున చెల్లిస్తోంది. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలకు.. ప్రభుత్వం చెల్లిస్తున్న దానికి పొంతనే ఉండటం లేదు. దీనికి తోడు సకాలంలో వారికి బిల్లులు చెల్లించడం లేదు. దీంతో మోజార్టీ కార్మికులు ఈ విధుల నుంచి తప్పుకొంటున్నారు. చేసేది లేక అధికారులు హరేకృష్ణ ఫౌండేషన్‌కు ఈ బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఉదయం వండిన ఆహారాన్ని 35–40 కిలోమీటర్ల దూరంలో ఉన్న స్కూలుకు త రలించేందుకు రెండు మూడు గంటల సమయం పడుతోంది. అప్పటికే వండిన ఆహారం చల్లబడి విద్యార్థులు తినకుండా తయారవుతోంది.

ఇదీ మెనూ

సోమ	రైస్, ఎగ్, వెజిటెబుల్ కర్రీ
మంగళ	రైస్, పాలకూర పప్పు
బుధ	రైస్, ఎగ్, వెజిటెబుల్ కర్రీ
గురు	రైస్, కాయకూరలతో కూడిన సాంబార్
శుక్ర	రైస్, ఎగ్, క్యాలిఫ్లవర్, క్యాబేజీ వెజిటేబుల్ కర్రీ
శని	వెజిటేబుల్ బిర్యానీ

సరూర్‌నగర్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కూరగాయలు	కేజీ ధర
క్యారెట్	రూ.60-80
బీన్స్	రూ.80-100
టమోటా	రూ.80-120
బీర	రూ.60-70
మిర్చి	రూ.80-100
దొండ	రూ.40-60
దోస	రూ.60-65
వంకాయ	రూ.40-60
ఆకు కూరలు (రెండు కట్టలు)	రూ.10-12
గుడ్డు ఒకటి	రూ.6.50
చికెన్	రూ.250
కందిపప్పు	రూ.140-150
పల్లీలు	రూ.140-150



బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తదితరులు

ప్రత్యేక విజన్‌తో సమగ్రాభివృద్ధి

- మహేశ్వరాన్ని మరో హైటెక్‌సిటీగా మారుస్తాం
- మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మరో హైటెక్‌సిటీగా మారుస్తామని విద్యా శాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అమీర్‌పేట్, ఘట్టుపల్లి, ఘట్టుపల్లి తండాల్లో సుమారు రూ.18 కోట్ల నిధులతో బీటీడబుల్ రోడ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు గురువారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరంలో ఇప్పటికే విప్రో, మలబార్ గోల్డ్, అమేజాన్, సోలార్, ఎల్ఈడీ టీవీలు, ఫోన్ల తయారీ తదితర కంపెనీలు వచ్చాయని త్వరలో మరిన్ని రాబోతున్నాయని తెలిపారు. పల్లె ప్రగతితో గ్రామాల రూపురేఖలు మార్చివేశామని, ప్రత్యేక విజన్‌తో సమగ్రాభివృద్ధి దిశగా తండాలు ముందుకెళ్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ కె.సునీత, ఎంపీ టీసీ సభ్యురాలు కుమారి రాయప్ప,పీఏసీఎస్ చైర్మ న్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వర్ణగంటి ఆనందం,జిల్లా రైతు కమిటీ సభ్యుడు కూన యాదయ్య, రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు పి.రాఘవేందర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

మండల పరిధిలోని అమీర్‌పేట్‌లో రూ.కోటి 10 లక్షలతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను మంత్రి సబితారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం అని పేర్కొన్నారు. అన్ని గ్రామాలు, తండాల్లో బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టి అభివృద్ధి చేస్తామన్నారు. అంతకు ముందు గ్రామంలోని అంబేడ్కర్, సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ, సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఈ కమిషనర్ మాకొద్దు



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న చైర్ పర్సన్ స్రవంతి, కౌన్సిలర్లు

- వాడివేడిగా 'పట్నం' కౌన్సిల్ సమావేశం
- కమిషనర్ యూసుఫ్ తీరుపై సభ్యుల ఆగ్రహం
- అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణ
- సమావేశం మధ్య నుంచి వెళ్లిపోయిన కమిషనర్

ఇబ్రహీంపట్నం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా సాగింది. చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీకి చెందిన 22 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ప్రజా సమస్యలపై చర్చ సందర్భంగా పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకుండా కమిషనర్ యూసుఫ్ దాటవేత ధోరణి అవలంబించారు. కమిషనర్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని కౌన్సిలర్లు తీవ్ర స్థాయిలో ఆరోపణలకు దిగారు. దీంతో ఆయన సమావేశం మధ్య నుంచి వెళ్లిపోయారు. అనంతరం చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, బీజేపీ కౌన్సిలర్లు ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ తదితరులు మీడియాతో మాట్లాడారు. అభివృద్ధి పనులకు కమిషనర్ యూసుఫ్ సహకరించడంలేదని విమర్శించారు. కౌన్సిలర్లను కించపరిచేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనా వ్యవహారాలు అస్తవ్యస్తంగా మారాయన్నారు. ఈ కమిషనర్ తమకొద్దంటూ అధికారపక్షంతోపాటు బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు ఏకగ్రీవ తీర్మానం చేశారు.

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి ఫిర్యాదు..

కౌన్సిల్ సమావేశం నుంచి అందరూ నేరుగా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసి కమిషనర్ వ్యవహారశైలిపై ఫిర్యాదు చేశారు. తక్షణమే ఆయనను తొలగించి మున్సిపాలిటీని కాపాడాలంటూ విజ్ఞప్తి చేశారు. కాగా కౌన్సిలర్ల ఆరోపణలపై కమిషనర్ యూసుఫ్‌ను సాక్షి ప్రశ్నించగా అవినీతి అక్రమాలకు పాల్పడితే నిరూపించాలన్నారు. బీసీ కులవృత్తులకు లక్ష సాయంపై టెలీ కాన్ఫరెన్స్ ఉంటే సమావేశం మధ్య నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్

- డీఈఓ సుశీందర్‌రావు

మంచాల: విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని డీఈఓ సుశీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో వీఆర్‌వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా కష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. తమ పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అందరి భాగస్వామ్యం ఉంటేనే విద్యార్థులకు మంచి విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ భిక్షపతి, ఎంఈఓ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్‌రావు

మద్యం మత్తులో చెరువులో దూకి..

- ఒకరి మృతి, మరొకరి గల్లంతు
- పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో ఘటన



హైదర్ ఖాద్రీ (ఫైల్)



అంజద్ (ఫైల్)

పహాడీషరీఫ్: మద్యం మత్తులో చెరువులో దూకిన ఇద్దరిలో ఒకరి మృతదేహం లభ్యం కాగా.. మరో యువకుడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా అన్సారీ రోడ్డుకు చెందిన మహ్మద్ అహ్మద్ ఖాన్ అతని స్నేహితులు సయ్యద్ సైఫ్ హుస్సేన్ (39), గౌస్ ఖాన్ (38), షైరా (35), మోజియా (35), హైదర్(35), అంజద్(32) మద్యం తాగేందుకు గురువారం కట్ట మైసమ్మ ఆలయ ప్రాంతానికి వచ్చారు. హుస్సేన్, గౌస్ ఖాన్, మోజియా ఒక దగ్గర ఉండగా.. మిగతా నలుగురు కాస్త దూరంగా ఉన్నారు. మద్యం మత్తులో హుస్సేన్, గౌస్ ఖాన్, మోజియా జల్‌పల్లి చెరువులోకి దూకారు. అరుపులు వినిపించడంతో స్నేహితులు అక్కడి చేరుకుని కాపాడేందుకు ప్రయత్నించారు. కర్రలు అందజేయగా షైరా బయటపడ్డాడు. హైదర్, అంజద్ నీట మునిగారు. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలించగా హైదర్ మృతదేహం లభ్యమైంది. అంజద్ కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర దర్యాప్తుతోనే నేరాల నియంత్రణ

రాయదుర్గం: భవిష్యత్తులో జరిగే నేరాలను అరికట్టడానికి సరైన విధానాలు, సమగ్ర, కచ్చితమైన దర్యాప్తు ప్రధానమని సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో గురువారం 'ది నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ యాక్ట్ 1985 ప్రొసీడురల్' హ్యాండ్‌బుక్‌ను పలువురు ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులను దర్యాప్తు చేసే అధికారులకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్‌కు సంబంధించిన లీగల్ ప్రొవిజన్స్, ఇన్వెస్టిగేషన్ పద్ధతులు, ప్రక్రియలను తెలుసుకునేందుకు ఈ పుస్తకం ఉపకరిస్తుందన్నారు.

24న తెలంగాణ క్రీడా వేడుకలు



గన్‌ఫౌండ్రీ: ఈ నెల 24న మంత్రి కేటీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని క్రీడా సంఘాల సమన్వయంతో తెలంగాణ క్రీడా వేడుకలను నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ తెలిపారు. గురువారం ఎల్‌బీ స్టేడియంలో వివిధ క్రీడా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడా వేడుకల్లో భాగంగా సైక్లింగ్, రోలర్ స్కేటింగ్, రెజ్లింగ్ వంటి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మల్లారెడ్డి,దత్తాత్రేయ, రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మహేందర్ పాల్గొన్నారు.

పేదలకు గృహ యోగం!

- సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు
- మూడు విడతల్లో రూ.లక్ష చొప్పున అందజేత
- ప్రతి నియోజకవర్గంలో 2,500 నుంచి 3వేల మందికి..

షాబాద్: నిరుపేదలకు గృహయోగం కలుగనుంది. పేదల సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం స్థలం సమస్య, నిధుల కొరతతో లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. దీంతో పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు దక్కలేదు. ఈ నేపథ్యంలో సొంతంగా స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు చేయూతనివ్వాలని ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి ఇటీవల శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల సాయం అందించాలని నిర్ణయించింది. ఈ సాయాన్ని రూ.లక్ష చొప్పున మూడు విడతల్లో అందించనుంది. ఒక్కో నియోజకవర్గంలో 2,500 మంది నుంచి 3వేల మందికి అందించేలా మార్గదర్శకాలు రూపొందించారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించనుంది. ఇందులో ఇళ్ల మంజూరు బిల్లుల చెల్లింపులు ఆన్‌లైన్‌లో జరిగేలా చర్యలు తీసుకోనున్నారు కలెక్టర్ నేతృత్వంలో అమలయ్యే ఈ పథకంలో భాగంగా రెండు గదులు, టాయిలెట్‌తో ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. త్వరలోనే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. లబ్ధిదారుడు తనకు నచ్చిన డిజైన్‌లో ఇంటిని నిర్మించుకోవచ్చు. ఈ పథకం కింద ఇల్లు నిర్మించుకునే వారు తప్పనిసరిగా రెండు గదులు, టాయిలెట్‌తో నిర్మాణం చేపట్టాలనే నిబంధన ఉంది.



మహిళ పేరు మీదే నిర్మాణం..

సొంత జాగా ఉండి ఇల్లు కట్టుకోవాలనుకునే వారికి ప్రభుత్వం ఆ ఇంటి మహిళ పేరున ఇల్లు మంజూరు చేస్తుంది. ఈ పథకం అమలు కోసం రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించనుంది. ఈ యాప్‌లో ఇళ్ల మంజూరు, బిల్లుల చెల్లింపులు అంతా ఆన్‌లైన్‌లో చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

పథకానికి అర్హతలు ఇవే..

- లబ్ధిదారుడు లేదా కుటుంబ సభ్యుడి పేరున ఆహార భద్రత కార్డు ఉండాలి.
- లబ్ధిదారుడికి సొంత స్థలంతోపాటు అక్కడే నివాసం ఉంటున్నట్లు ఓటర్ ఐడీ లేదా ఆధార్ కార్డు ఉండాలి.
- ఆర్‌సీసీ ఇల్లు ఉంటే అనర్హులు.
- దరఖాస్తుదారుడి కుటుంబసభ్యులు జీఓ 59 ప్రకారం లబ్ధిపొంది ఉంటే పథకానికి అనర్హులు.

ప్రాధాన్యత ఇలా..

- ప్రతి నియోజకవర్గంలో ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10, బీసీలు, మైనారిటీలకు 50 శాతానికి తగ్గకుండా ప్రాధాన్యం.
- దరఖాస్తులు ఎక్కువగా వస్తే వెయిటింగ్ లిస్ట్ రూపొందించి, తరువాత మంజూరైన ఇళ్లలో ప్రాధాన్యం కల్పిస్తారు.
- మహిళ పేరున ఇల్లుతోపాటు రూ.3లక్షల సాయం మంజూరవుతుంది.
- నిర్మాణ పురోగతిని బట్టి దశల వారీగా మూడు విడతల్లో నిధులు మంజూరు చేస్తారు.
- బేస్‌మెంట్ లెవల్‌కు రూ.లక్ష, రూఫ్ లెవల్‌కు రూ.లక్ష, నిర్మాణం పూర్తయ్యాక మిగిలిన రూ.లక్ష అందిస్తారు.
- ఎప్పటికప్పుడు నిర్మాణం పూర్తయిన ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- నగదు జమచేయడానికి లబ్ధిదారుడు ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరవాలి.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వీర్లపల్లి శంకర్

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రానున్న ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని 19, 21 వార్డుల నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శంకర్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ రెండు ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేఖ విధానాలు అవలంబిస్తున్నాయని అన్నారు. దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి, ఉపాధి కల్పన వంటి హామీలు అమలు కాలేదన్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయని అన్నారు. ప్రజలందరు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గ చూపుతున్నారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి సారథ్యంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారిలో కృష్ణ, లక్ష్మణ్, సత్యనారాయణ, రమేష్, జంగయ్య, రాఘవేందర్, కృష్ణ, మస్తాన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, శ్రీను నాయక్, షర్ఫొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యాచారం ఠాణా ముట్టడి

- తల్లీకొడుకు మృతికి కారణమైన వారిని శిక్షించాలి : మొండిగౌరెల్లి గ్రామస్తుల డిమాండ్
- సాగర్‌రోడ్డుపై ధర్నా, రాస్తారోకో.. ఉద్రిక్తత

యాచారం: రోడ్డు ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి, డ్రైవర్‌ను శిక్షించాలని కోరుతూ మొండిగౌరెల్లి గ్రామస్తులు గురువారం యాచారం పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. బుధవారం ఇదే గ్రామానికి చెందిన నారమ్మ, ఆమె కుమారుడు యాదయ్య బైక్‌పై వెళుతుండగా.. వాహనం ఢీకొనడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. రెండు రోజుల్లో నారమ్మ ఇంట్లో శుభకార్యం ఉండగా.. ఈ విషాదం నెలకొనడంతో గ్రామస్తులను కదిలించింది. దీంతో ఆగ్రహించిన వందలాది మంది యాచారం పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్టేషన్‌కు ఎదురుగానే ఉన్న సాగర్‌రోడ్డుపై రాస్తారోకో, ఆందోళనకు దిగారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి, డ్రైవర్‌ను అరెస్టు చేసే వరకు మృతులకు అంత్యక్రియలు నిర్వహించేది లేదని, పోస్టుమార్టం కూడా జరగనీయబోమని భీష్మించుకొని కూర్చున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ముందు జాగ్రత్త చర్యగా సీఐ సైదయ్య ఇబ్రహీంపట్నం నుంచి అదనపు పోలీస్ సిబ్బందిని రప్పించారు. సీసీ కెమెరాల ద్వారా వాహనాన్ని గుర్తించామని, మృతుల కుటుంబానికి న్యాయం చేస్తామని సీఐ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. అనంతరం తల్లీకొడుకుల మృతదేహాలను పోస్టుమార్టం పూర్తయ్యాక.. సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి.



యాచారం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మొండిగౌరెల్లి గ్రామస్తులు

బైక్‌ను ఢీకొన్న ఆటో

ఇద్దరికి తీవ్ర గాయాలు

యాచారం: ఆటో.. బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని నస్దిక్‌సింగారం గ్రామానికి చెందిన డానియెల్, ప్రకాష్ గురువారం కందుకూరు మండలం మీరాఖాన్‌పేటకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.

బీజేపీ గెలుపునకు శ్రమిద్దాం

పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న బాకారం నాయకులు

మొయినాబాద్ రూరల్: రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేద్దామని ఆ పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. నూతన బాధ్యతలు తీసుకున్న ఈటల రాజేందర్‌ను పార్టీ మండల ఉపాధ్యక్షుడు వినయ్‌రెడ్డి, బాకారం గ్రామ యువకులు కలిశారు. ఈటలను సన్మానించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన బాకారం నాయకులు రమేష్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, రవిగౌడ్ మరి కొందరు బీజేపీలో చేరారు. వారికి ఈటల కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు.

నాలుగు లేన్ల రహదారి వేయండి

ఎస్బీపల్లి సర్పంచ్ వినతికి స్పందించిన కేంద్రం



సర్పంచ్ ప్రభాకర్ ఇచ్చిన వినతిని పరిశీలిస్తున్న కేంద్రమంత్రి మహేంద్రనాథ్‌పాండే (ఫైల్)

కొత్తూరు: తమ గ్రామానికి నాలుగు లేన్ల రహదారిని ఏర్పాటు చేయాలని ఎస్బీపల్లి సర్పంచ్ ప్రభాకర్ విజ్ఞప్తికి కేంద్రం స్పందించింది. సర్పంచ్ వినతిని సంబంధిత శాఖకు బదిలీ చేసినట్లు కేంద్రమంత్రి కార్యాలయం నుంచి లేఖ వచ్చింది. దీంతో సర్పంచ్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. కేంద్ర నిధులతో చేపట్టిన రోడ్డు పనుల పరిశీలనలో భాగంగా ఈ నెల ఐదో తేదీన కేంద్రమంత్రి మహేంద్రనాథ్‌పాండే ఎస్బీపల్లికి వచ్చారు. ఎస్బీపల్లితో పాటు సిద్ధాపూర్, పెంజర్ల గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటు కోసం వందల ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం సేకరించినట్లు సర్పంచ్ ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. పరిశ్రమలు ఏర్పాటైతే భారీ వాహనాలతో పాటు ఇతర వాహనాల రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్లపై రద్దీ పెరిగి స్థానికులు ఇబ్బంది పడతారని మంత్రి దృష్టికి తెచ్చారు. దీంతో కొత్తూరు జాతీయ రహదారి నుంచి సిద్ధాపూర్ వరకు నాలుగు వరుసల రహదారిని మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. లోక్‌సభ ప్రవాస్ యోజనలో భాగంగా సర్పంచ్ వినతిని కేంద్రమంత్రి పరిశీలించి సంబంధిత శాఖకు బదిలీ చేస్తున్నట్లు ఆయన కార్యాలయం నుంచి లేఖ వచ్చిందని సర్పంచ్ ప్రభాకర్ తెలిపారు.

షాద్‌నగర్ ఆర్డీఓగా మాధవరావు



షాద్‌నగర్: షాద్‌నగర్ ఆర్డీఓగా డి.వెంకట మాధవరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఆర్డీఓగా పని చేసిన రాజేశ్వరీని కొమురంభీం ఆసిఫాబాద్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా మే నెలలో బదిలీ చేశారు. అప్పటి నుంచి ఇన్‌చార్జిగా కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు పనిచేశారు. పెద్దపల్లి ఆర్డీఓ వెంకటమాధవరావును షాద్‌నగర్‌కు బదిలీ చేయడంలో ఆయన పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి



పడకల్‌లో బోల్తా కొట్టిన ట్రాక్టర్

తలకొండపల్లి: ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని పడకల్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్‌యాదవ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెవిటి మల్లేశ్ (42) తన పొలంలో పశువుల షెడ్ మరమ్మతు, వ్యవసాయ పొలం పనుల నిమిత్తం ట్రాక్టర్‌పై విత్తనం బ్యాగ్‌లు, సిమెంట్, కంకర సంచులకు వేసుకొని డ్రైవ్ చేసుకుంటూ బయలుదేరాడు. మార్గమధ్యంలో కాలువ దగ్గర ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌పై నుంచి మల్లేశ్ కింద పడిపోయాడు. తలకు బలమైన దెబ్బలు తగలడంతో మల్లేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దొంతాన్‌పల్లి నుంచి గోవుల తరలింపు



గోవులను తరలిస్తున్న అధికారులు, సిబ్బంది

శంకర్‌పల్లి: కలెక్టర్ ఆదేశాలతో దొంతాన్‌పల్లి గోశాలలో ఉన్న గోవులను గురువారం వివిధ గోశాలలకు తరలించారు. నిర్వహణ సక్రమంగా లేక గోవులు మృత్యువాత పడుతుండడంతో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జిల్లా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు విజయ్ కుమార్, చేవెళ్ల ఆర్డీవో వేణుమాధవ్, శంకర్‌పల్లి తహసీల్దార్ నయిముద్దీన్, సీఐ నరేష్ సమక్షంలో గోవులకు ట్యాగింగ్ చేసి తరలించారు. నగరంలోకి ఫిలింనగర్‌లో గల తులసి గోశాల, మహాలింగపురంలోకి సప్తమి గోశాల, మియాఖాన్‌గడ్డలోని శేణుగోపాల స్వామి గోశాల, అమీన్‌పూర్ పరిధిలో భ్రమరాంబ గోశాల, కోకాపేట్ పరిధిలోని శ్రీక్రిష్ణ గోశాలకు గోవులను తరలించారు. శంకర్‌పల్లి సీఐ నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కాగా పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన బుచ్చిరెడ్డికి చెందిన భూమి 3.20ఎకరాలను నగరానికి చెందిన శ్రీనివాస్ పది సంవత్సరాల లీజుకు తీసుకొని గోశాలను నిర్వహించడం జరిగిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. లీజు కాలం ముగియడంతో గోవుల సంరక్షణను ఎవరూ పట్టించుకోలేదని దీంతో అవి మృత్యువాత పడినట్లు తెలిపారు. భూ యజమానులు కూడా తమ భూమిలో నుంచి గోశాలను తీసివేయాలని కోర్టును ఆశ్రయించడం జరిగింది. దీంతో గోవులను ఇతర గోశాలలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

ఊర కుక్కల దాడిలో నెమలి మృతి



మృతి చెందిన నెమలి

కందుకూరు: కుక్కల దాడిలో జాతీయ పక్షి నెమలి మృతి చెందింది. ఈ సంఘటన కందుకూరు చౌరస్తాలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని భూలక్ష్మీ ఆస్పత్రి సమీపంలోకి వచ్చిన నెమలిపై ఊర కుక్కలు మూకుమ్మడిగా దాడి చేశాయి. అక్కడ ఉన్న వారు వాటిని పారద్రోలే సమయానికే నెమలి తీవ్రంగా గాయపడి మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు నెమలిని తీసుకెళ్లారు.

ఇదేం నాణ్యత..!

- కాంట్రాక్టర్, అధికారులపై మండిపడిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు
- రోడ్డుకు మరో లేయర్ వేయాలని ఆదేశం

మొయినాబాద్: రోడ్డు నిర్మాణంలో ఎలాంటి నాణ్యత పాటించాలో అగ్రిమెంట్‌లోనే ఉంటుంది.. కానీ నాణ్యత లేకుండా రోడ్డు వేయడం ఏమిటని క్వాలిటీ కంట్రోల్ అధికారులు కాంట్రాక్టర్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొయినాబాద్ నుంచి సురంగల్ వరకు 2 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేశారు. గురువారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఆ రోడ్డును పరిశీలించారు. నాణ్యత పరిశీలనలో భాగంగా రోడ్డులో అక్కడక్కడ నమూనాలు సేకరించారు. నాణ్యత లేని మెటీరియల్ వాడారని మండిపడ్డారు. నాణ్యత ప్రమాణాలు కూడా పాటించలేదని అన్నారు. మరో లేయర్ వేయాలని సూచించారు. లేదంటే కాంట్రాక్టర్ తోపాటు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని క్వాలిటీ కంట్రోల్ అధికారులు హెచ్చరించారు.



నాణ్యత పరిశీలనకు నమూనాలు సేకరిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

విద్యుదాఘాతంతో ఆవు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు

కొందుర్గు: విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందిన సంఘటన గురువారం కొందుర్గు మండలంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నరేష్‌కు ఆవు ఉంది. గురువారం సాయంత్రం ఆమును మేతకోసం వదిలాడు. గ్రామ సమీపంలోని పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ఆవు విలువ దాదాపు రూ. 60 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు.

డాబా పైనుంచి పడి వ్యక్తి మృతి



సిరాజ్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: డాబాపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి షాద్‌నగర్‌లో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ తుక్యానాయక్ కథనం ప్రకారం.. పట్టణంలోని శ్రీనివాసకాలనీకి చెందిన సిరాజ్ (55), జరీనా బేగం దంపతులు. ఇద్దరు కూలీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. బుధవారం రాత్రి సిరాజ్ డాబా(ఇంటిపైకి)పైకి వెళ్లాడు. కాలుజారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు ఉమాదేవి సిరాజ్ అంత్యక్రియల కోసం రూ 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ఆమనగల్లు: పట్టణంలో గురువారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా ఆమనగల్లులో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడటంతో 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శ్రీనివాస్‌ను హైదరాబాద్‌కు తరలించినట్లు ఏఎస్ఐ యాదయ్య తెలిపారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు జరిగే పోటీ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

యాచారం: స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశం నిమిత్తం గురువారం ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. యాచారం ఎంఈవో వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్ దేవదాసు, చింతపట్ల ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సాబేర్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 55 మంది విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, రన్నింగ్ తదితర పోటీ పరీక్షలు నిర్వహించారు. 30 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 14న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో యాచారం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.